క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు



ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండల కేంద్రం ఏలేశ్వరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను గురువారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం, ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయం, ఎంఈఓ, వెలుగు కార్యాలయాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు లేకపోవడాన్ని గుర్తించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు తాను వచ్చినట్టు ఆయా కార్యాలయాల వద్ద లెటర్ రాసి పెట్టానన్నారు. అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకువెళతామని చెప్పారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి రూ.2 లక్షల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై రవికుమార్, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: లివర్ వ్యాధితో బాధ పడుతున్న ఏవీ నగరం గ్రామానికి చెందిన కొంజర్ల కృష్ణకు స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కొంజర్ల కృష్ణ గత కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. సమస్యను బంధువులు స్ఫూర్తి ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు దాతల నుంచి రూ.2 లక్షలు సేకరించారు. ఆ నగదును కాకినాడ ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు తొండంగి ఎస్సై రవికుమార్ చేతుల మీదుగా కొంజర్ల కృష్ణ కుటుంబానికి అందజేశారు. అలాగే ఎస్ఐ రవికుమార్ తన వంతు సాయం రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఎస్ఎస్ఆర్ వెంకట్, శేషగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సింగరంపాలెంలో పొలంబడి

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి రైతులు, వీవీలకు పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. రైతులు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణపతిరాజు, ఉప సర్పంచ్ రాంబాబు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తుని: స్థానిక పార్క్ రోడ్డులోని పుష్ప కంటి ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వాసవీ చారిటబుల్ ట్రస్ట్ తుని శాఖ అధ్యక్షుడు కుసుమంచి సత్యనారాయణ గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కంటిలో శుక్లాలు ఉన్న వారిని విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లి శస్త్రచికిత్స చేస్తారన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పి.సూరంపాలెంలో గడపగడపకూ...

గండేపల్లి: మండలంలోని పి.సూరంపాలెంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



హంసవరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్

తుని రూరల్: తల్లిపాలే బిడ్డకు రక్షణకవచం అని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ అన్నారు. హంసవరంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ మేరీ అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డల సంరక్షణ, శిశు మరణాలు నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అధిక ప్రాధాన్యం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- జగ్గంపేటలో రూ.14.40 లక్షలతో నిర్మించిన వంతెన ప్రారంభం



జగ్గంపేట శ్రీరామనగర్‌లో బ్రిడ్జిని ప్రారంభించిన మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: రాష్ట్రంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజా అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. జగ్గంపేటలో రూ.14.40 లక్షలతో స్థానిక శ్రీరామనగర్, గోకవరం రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన వైఎస్సార్ వారధిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ జగ్గంపేటలో అత్యధిక జనాభా కలిగిన ప్రదేశం శ్రీరామ్‌నగర్ అని, ఈ ప్రాంతవాసులు వాహనాలతో బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేక గత 15 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా కృషితో వంతెన నిర్మించడం అభినందనీయమన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ జగ్గంపేటలో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. దీనికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరవలేనిదని, సమస్యను వివరించిన వెంటనే నిధులు మంజూరు చేసారని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజల సౌకర్యార్థం కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగ్గంపేటలో గడపగడపకూ...



జగ్గంపేటలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేటలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శ్రీరామనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. డ్రైన్లు, రోడ్లు, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

దివిస్ సీనియర్ మేనేజర్ సుధాకర్



ఒంటిమామిడిలో దివీస్ పరిశ్రమ ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్

తొండంగి: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని దివిస్ లేబొరేటరీస్ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్ అన్నారు. ఒంటిమామిడి పంచాయతీలో కొత్తపాకలులో రూ.15 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తి మేరకు కోన ప్రాంత గ్రామాల్లో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నట్టు తెలిపారు. ఒంటిమామిడి పంచాయతీలో ఇప్పటికే రెండు ఆర్వోప్లాంట్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోశాల కిషోర్, దివిస్ ప్రతినిధులు బి.వాసుబాబు, ఇ.శ్రీనాగరాజు, గ్రామ నాయకులు అంగుళూరి పంపరాజు, అంగుళూరి బంగార్రాజు, పోలినేటి చిట్టిబాబు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల

ప్రత్తిపాడు రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఇ.గోకవరం సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు నుంచి 10 వేల ఎకరాల ఆయకట్టుకు గురువారం ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరు అందిస్తామన్నారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టును ఆధునీకరించి ఆయకట్టు చివర ఎకరాకూ నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ టి.పోచారావు, ఏఈఈ ఎస్‌కే ఇబ్రహీం, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దో చిట్టిబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ ఆయకట్టుకు నీరు విడుదల



తాండవ నదికి పూజలు చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకరగణేష్

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు గురువారం నీటిని విడుదల చేశారు. తొలుత జలాశయం వద్ద గంగమ్మతల్లికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ పూజలు చేశారు. అనంతరం ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టులో ప్రస్తుతం 370.9 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీరు ఆయకట్టు అవసరాలకు 65 రోజులు సరిపోతుందన్నారు. ఎడమ కాలువకు 200 క్యూసెక్కులు, కుడి కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, సొసైటీ చైర్మన్ గొర్లి రామ చంద్రరావు, సర్పంచ్ సుర్ల రాంబాబు, నల్లమిల్లి గోవిందు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



ఎస్.అన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు కృష్ణ కిరణ్

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని రెండు, మూడు కోడ్ నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, పౌరసరఫరాల శాఖ డీఎం ఓ.పుష్పవాణిలతో కలసి ఆయన అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంపూర్ణ పోషణ, టేక్ హోం రేషన్‌లో భాగంగా లబ్ధిదారులందరికీ ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా నెలకు సరిపడా సరకులను పంపిణీ చేయాలని అంగన్‌వాడీలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార నాణ్యతను విధిగా పాటించాలన్నారు. ఆహార పదార్థాలు, చిన్నారుల హాజరు, రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత, ఏసీడీపీఓ ఎం.నిహారిక, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఆట్యా పాట్యా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తుని: రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు రాష్ట్ర ఆట్యాపాట్యా అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ జాబేజ్ తెలిపారు. తుని రాజా కళాశాల మైదానంలో గురువారం జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా బాలురు, బాలికల విభాగాల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 19, 20 తేదీల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఆట్యాపాట్యా జిల్లా అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ, టెన్నీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, జిలా కార్యదర్శి ప్రశాంతి కుమార్, జి.విక్టర్‌బాబు, పీడీలు సాధన, వరలక్ష్మి, పరదేశమ్మ, కృష్ణ, కోచ్ పాపారావు తదితరులు అభినందించారు.

జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

బాలుర జట్టు

బి.ప్రసాద్, ఎం.వర్షిత్, ఎస్.కార్తీక్, ఎం.మదన్, ఆర్.లక్ష్మణ్, పి.దుర్గా ప్రసాద్, ఆర్.జగన్, టి.సతీష్, జి.హేమ సతీష్, ఎ.శ్యామ్, బి.కిరణ్, ఎంఎస్ఎస్ ప్రసాద్.

బాలికల జట్టు

సీహెచ్ శిరీష, కె.స్నేహ, బి.సిరి, ఎస్.మేఘన, కె.క్రాంతి కుమారి, ఎస్.గుణప్రియ, ఈ.తేజశ్రీ, వి.ప్రసన్న, డి.గంగ, ఆర్.జయశ్రీ, డి.శాంతి.

యువతి అదృశ్యం

జగ్గంపేట: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కంటిపల్లి రమణకు ఇద్దరు కుమార్తెలు.చిన్న కుమార్తె స్వీటీ ఇంటర్మీడియెట్ చదివి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 9న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కర్రలతో దాడి

జగ్గంపేట: మండలంలోని రామవరంలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గ్రామపెద్దలు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండపాక వెంకటేశ్వరరావు, మండపాక బ్రహ్మాజీ మధ్య జాతర జరిపే విషయంలో మాటామాటా పెరిగి ఒకరినొకరు కర్రలతో కొట్టుకొన్నారు. ఇద్దరికీ బలమైన గాయాలు కాగా జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించారు. ఇరువురు చేసిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు జగ్గంపేట హెడ్‌కానిస్టేబుల్ పి.రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

తుని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిడి సత్యనారాయణరాజు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తుని బాలికల కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, రన్నింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ పి.తారకేశ్వరి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నారాయణ స్కూల్, లయోలా స్కూల్ ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి, సాయినగర్, ఎంఆర్ పేట, ఫైర్ ఆఫీసు, రామా థియేటర్, గొల్ల అప్పారావుసెంటర్, నక్కిన వీధి, చేపల మార్కెట్, గరువువీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ట్రాన్స్‌కో ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. ఒంటిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని తొండంగి, కృష్ణాపురం, పి.అగ్రహారం, ఒంటిమామిడి, దానవాయిపేట, ఏవీ నగరం సబ్ స్టేషన్ పరిధిలోని ఏవీ నగరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, శృంగ వృక్షం, పెరుమళ్లపురం, పాతచోడిపల్లిపేట, కొత్తచోడిపల్లిపేట, అన్నయ్యపేట సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నయ్యపేట, జీఎం పేట, యర్రయ్యపేట, పైడికొండ, వేమవరం, ఆనూరు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కిర్లంపూడి: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని పాలెంలో గురువారం అడబాల సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తాను అనారోగ్యంతో ఉన్న సమయంలో ఆసుపత్రికి వచ్చి పలకరించిన ప్రతి ఒక్కరినీ ఆత్మీయ సభల ద్వారా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, తోట రాంజీ, తోట అయ్యన్న, పల్లెకల గంగరాజు, రాపేటి శ్రీను, అత్తులూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేలతల్లి సంరక్షణ అందరి బాధ్యత

తుని రూరల్: నేలతల్లి సంరక్షణ అందరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కేఓ మల్లవరంలో గురువారం సర్పంచ్ డొంక సత్యవతి అధ్యక్షతన నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అధికారులు, విద్యార్థులు నేలతల్లిని కాపాడుకుందాం, వీరులకు వందనం అంటూ ప్రతిజ్ఞ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని వేమవరం, అద్దరిపేట గ్రామాల్లో గురువారం నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ ప్రారంభించారు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు.

అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం

- స్కూల్‌కి వెళ్లకుండా ఓ ఇంట్లో దాక్కొన్న విద్యార్థులు
- మూడు గంటల పాటు ఉత్కంఠ



బంధువుల చెంతకు చేరిన విద్యార్థులు భవ్య, సుస్మిత

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం రేగింది. విద్యార్థులు స్కూల్‌కి వెళ్లలేదని తెలియడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని గ్రామంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో చిన్నారులు దాక్కొన్నట్టు గుర్తించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...అచ్యుతాపురం ఎస్సీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మైలపల్లి నాగేంద్ర, శశికళకు చెందిన ఎనిమిదేళ్ల భవ్య, ఆరేళ్ల సుస్మిత స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో చదువుకుంటున్నారు. వీళ్లు రెండు రోజుల నుంచి పాఠశాలలకు వెళ్లలేదు. గురువారం తల్లి వీరిని పాఠశాలకు పంపించగా వీరు స్కూల్‌కు వెళ్లలేదు. పాఠశాల ఉపాధ్యాయులు తండ్రికి ఫోన్ చేసి పిల్లలు పాఠశాలకు రాలేదని చెప్పడంతో ఆటో కిరాయికి వెళ్లిన నాగేంద్ర గ్రామానికి వచ్చి పిల్లల గూర్చి భార్యను ప్రశ్నించాడు. పిల్లలు ఇద్దరు ఉదయమే పాఠశాలకు వెళ్లారని ఆమె బదులు చెప్పడంతో కంగారు పడి తల్లిదండ్రులు ఇద్దరూ స్కూల్‌కి వెళ్లి విచారించగా స్కూల్‌కి రాలేదని తెలిసింది. విషయం స్థానికులకు కూడా తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గ్రామంలో గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ముమ్మరంగా గాలించి

ఎస్సై శివనాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో ప్రతి ప్రదేశాన్ని గాలించారు. అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. సోషల్ మీడియా ద్వారా గ్రూపుల్లో పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. గ్రామంలో ఉదయం సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసేవారు ఇంటింటికీ తిరిగారని సమాచారం తెలియడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో ఉదయం పాఠశాలకు వెళతామని చెప్పిన చిన్నారులు పాఠశాలకు సమీపంలో ఓ షాపు వద్ద చాక్లెట్లు కొనుక్కున్నారని గుర్తించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లలకు వరుసకు చిన్నాన్న అయిన ఓ వ్యక్తి నూతనంగా ఇంటిని నిర్మించుకోవడంతో ఆ ఇంట్లో ఓ గదిలో దాక్కొని ఉన్న వీరిని స్థానికులు గుర్తించారు. మూడు గంటల ఉత్కంఠ అనంతరం పిల్లల ఆచూకీ లభ్యమైంది. పోలీసులు ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ బాలుడిని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడని, గుర్తించిన స్థానికులు కేకలు వేయడంతో విడిచిపెట్టాడని ఇప్పుడు కూడా అటువంటి సంఘటనే జరిగి ఉంటుందని భయపడ్డామని గ్రామస్తులు తెలిపారు.

గద్దర్ సేవలు చిరస్మరణీయం

గోకవరం: ప్రజాయుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్ సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం గద్దర్ తన కలాన్ని, గళాన్ని, ఆట, పాటలను వినియోగించారన్నారు. తుపాకీ తూటాలకు ఎదురొడ్డి ప్రజా సమస్యలపై పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డి.సురేష్, శ్రీకాంత్, గోలి మునలయ్య, గుడిసె అబ్బు, కడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

గోకవరం: స్థానిక ఎంపీపీ పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను సంఘ నాయకులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బీఎల్‌వీఎన్ కాశీ, ఎస్.కుమార్, కె.నాగభూషణం, కె.శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



ఏలేశ్వరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బూరుగుపూడిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కిర్లంపూడి: నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా గురువారం బూరుగుపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ఎమ్మెల్యే చంటిబాబు స్వయంగా మాత్రలు మింగించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న సుమారు 13 వేల మంది విద్యార్థులకు (90 శాతం) గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, పాఠంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు భద్రి, జనపరెడ్డి బాబు, భూపాలపట్నం ప్రసాద్, చదలవాడ బాబీ, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: హంసవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ఏలేశ్వరం: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం నియోజకవర్గవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, పేరవరం తదితర గ్రామాల్లో విద్యార్థులకు మాత్రలు ఆరోగ్య సిబ్బంది మాత్రలు వేశారు. పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ ప్రసాద్, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మిగించారు. తూర్పులక్ష్మీపురంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, భద్రవరంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు చిన్నారులకు మాత్రలు వేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో విద్యార్థులు, పిల్లలకు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులి రామకృష్ణ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.